
సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 16 । జూన్ । 2025



దెబ్బతిన్న ప్రహరీ.. పడితే హరీ..

పెనుశిల ఘాట్ రోడ్డు వెంట రక్షణ గోడ కూలిపోయింది. దాన్ని పునర్నిర్మించలేదు. ప్యాచింగ్ పనులతో కాలయాపన..మరమ్మతులతో కాలం నెట్టుకొస్తున్నారు. -8లో



హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని సీఎం చంద్రబాబును, కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.120	రూ.170



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1803 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీజీ	470	470
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 59.720 కిలోలు

న్యూస్‌రీల్

బదిలీ ప్రక్రియ పూర్తి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడపజిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, బాషా పండితులకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు సంబంధించిన బదిలీ ప్రక్రియ మొత్తం పూర్తయింది. ఈ విషయాన్ని వైఎస్సార్‌జిల్లా డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 16వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని కలెక్టర్ పేర్కొన్నారు.

20 నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం



ప్రొద్దుటూరు కల్చరల్: పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సుల ప్రవేశాలకు ఈనెల 20వ తేదీ నుంచి కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.అశోక్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలింగ్‌కు సంబంధించిన ప్రాసెసింగ్ ఫీజును ఈనెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ వెల్లడించిందని ఆయన పేర్కొన్నారు. పాలిసెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వెబ్ ఆప్షన్లను జూలై 1న మార్చుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఫీజు చెల్లించిన రశీదు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, టీసీ, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ ఆధార్ కార్డు తీసుకుని రావాల్సి ఉంటుందని వివరించారు.

లైనింగ్ సాగదు.. నీళ్లు రావు!

- ఆరునెలల్లో పనులు పూర్తి చేస్తామంటూ గొప్పలు
- భిన్నంగా వాస్తవ పరిస్థితులు
- కృష్ణా జలాలు తరలించే వీలున్నా పనుల పేరుతో మదనపల్లె సమ్మర్ స్టోరేజీలను ఎండబెట్టారు



పుంగనూరు ఉప కాలువ మధ్యలో ఆపేసిన లైనింగ్ పనులు

మదనపల్లె: ఆరునెలల్లో హంద్రీ–నీవా ఉప కాలువలకు లైనింగ్ పనులు పూర్తి చేయిస్తాం, కాలువలు, రైతులకు కృష్ణా జలాలు అందిస్తామని ప్రభుత్వం పదే పదే ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1,217 కోట్లతో చేపట్టిన పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులకు సమాధి కట్టి..రైతుల నోట్లో మట్టి కొట్టేలా కాంక్రీటు లైనింగ్ పనులు చేపట్టింది. ఈ పనులనైనా పూర్తి చేయించి కృష్ణా జలాలు అందిస్తారా అంటే అదీ ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. దీంతో కరువు రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిగా తయారైంది. మంత్రి నిమ్మల రామానాయుడు కాలువలను పరిశీలించి చెప్పిన మాటే మళ్లీ మళ్లీ చెప్పి వెళ్లారు. ఆరునెలల గడువు పూర్తి కావస్తోంది. పనులేమో నత్త కంటే మెల్లగా సాగుతున్నాయి. పనుల పర్యవేక్షణ, నాణ్యతా ప్రమాణాలపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాలువలో జరిగిన పనులపై క్వాలిటీకంట్రోల్ విభాగం కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.


ఆరు నెలల్లో నీళ్లు ఒట్టిదే

పుంగనూరు ఉపకాలువ, కుప్పం ఉప కాలువ లైనింగ్ పనులను ఆరు నెలల్లో పూర్తి చేయించి నీళ్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాంట్రాక్టర్లతో ఒప్పందం మేరకు కుప్పం కాలువ పనులను ఈ ఏడాది ఫిబ్రవరి 19 నుంచి వచ్చే ఫిబ్రవరి 18 నాటికి పూర్తి చేయాలి. పుంగనూరు ఉపకాలువ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విస్తరణ పనుల కాంట్రాక్టు దక్కించుకున్న కంపెనీతోనే కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఒప్పందాన్నే కొనసాగిస్తూ వచ్చే జనవరి 31 నాటికి పనులు పూర్తి చేయాలనుకుంది. దీంతో కాంట్రాక్టు సంస్థ లైనింగ్ పనులు చేస్తోంది. అయితే ఆరునెలల్లో లైనింగ్ పనులు పూర్తి చేయించి చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను అన్నమయ్యజిల్లా మీదుగా చిత్తూరుజిల్లా కుప్పం వరకు తరలిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే వాస్తవ పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. కుప్పం లైనింగ్ పనుల్లో వేగం కనిపిస్తున్నా పుంగనూరు కాలువ లైనింగ్ పనులు పడకేశాయి. పనుల్లో జాప్యంపై అధికారులు ప్రశ్నించే సాహసం కూడా చేయలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం చెప్పిన ఆరునెలల కాలం పూర్తి కావొచ్చినా పనులు చేయించడంలో విఫలమైంది. కృష్ణా జలాల తరలింపు ప్రకటనలకే పరిమితం అన్నట్టుగా ఉంది.

ఆపి..ఆపి పనులు

ఈ రెండు కాలువలకు జరుగుతున్న లైనింగ్ పనులు విచిత్రంగా ఉన్నాయి. ఒక చోటను నుంచి మొదలుపెట్టిన పనులు ముందుకు సాగడం చూస్తుంటాం. అయితే ఈ పనులు మాత్రం ఒక్కోచోట ప్రారంభించి కొద్దిగా చేశాక వదిలేస్తారు..తర్వాత కొంత దూరంలో మొదలుపెట్టి అక్కడ చేశాక దాన్ని వదిలేసి మరోచోట చేస్తారు. ఇలా ప్యాచ్‌ల మాదిరిగా చేస్తున్నారు. ఇలా చేసిన పనిని లెక్కించి పుంగనూరు ఉపకాలువలో 47 కిలోమీటర్లు, కుప్పం కాలువలో ప్యాకేజీ–1లో 32.7 కిలో మీటర్లు, ప్యాకేజీ–2లో 30.14 కిలో మీటర్ల పని పూర్తి చేశారు. ఈ రెండు కాలువల్లో ఇంకా 98.313 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

నమ్మించి మోసం



లైనింగ్ పనులు ఎప్పుడు పూర్తి చేయిస్తారో స్పష్టంగా చెప్పాల్సిన ప్రభుత్వం ఆరునెలల్లో నీళ్లిస్తామని రైతాంగాన్ని నమ్మించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుష్కలంగా వర్షాలు కురిసిన సీజన్‌లో మినహాయించి 6.4618 టీఎంసీల కృష్ణా జలాలను మూడేళ్ల తరలించారు. ప్రస్తుతం పనులు పూర్తి కాకపోవడంతో ఈఏడాది నీళ్ల తరలించని ప్రభుత్వం ఒప్పందం మేరకు వచ్చే ఫిబ్రవరిలో పనులు పూర్తి చేయించాక కృష్ణా జలాలపై రైతాంగం ఆశలు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

13.5.25 నాటికి లైనింగ్ పనులు

పుంగనూరు ఉప కాలువ:	117.76 కి.మీ
పని జరిగింది:	47 కి.మీ
మిగిలింది:	70.76 కి.మీ
పని విలువ	రూ.480.22 కోట్లు
కుప్పం ఉప కాలువ:	
ప్యాకే జీ-1:	42.831 కి.మీ
పని జరిగింది:	32.7 కి.మీ
మిగిలింది:	10.131 కి.మీ
పని విలువ:	రూ.85,46,72,008
ప్యాకేజీ-2:	47.562 కి.మీ
పని జరిగింది:	30.14 కి.మీ
మిగిలింది:	17.422 కి.మీ
పని విలువ:	రూ.84,33,77,927

ఎస్ఎస్ ట్యాంకులను ఎండబెట్టారు

మదనపల్లె పట్టణ ప్రజల దాహం తీర్చేందుకు దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా మదనపల్లె సమీపంలో 59 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యంతో చిప్పిలి, 131 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యంతో గుంటిపల్లె సమ్మర్‌స్టోరేజి ట్యాంకులను రూ.42.8 కోట్లతో నిర్మించారు. పుంగనూరు ఉపకాలువ నుంచి కష్ణా జలాలు తరలించేలా రూపకల్పన చేశారు. అప్పటికే 82 శాతం పనులు పూర్తి చేయించారు. 2023 నాటికి చిప్పిలికి సంబంధించి రూ.10.30 కోట్లు, గుంటివారిపల్లెకు సంబంధించి రూ.9.73 కోట్ల పనులు పూర్తి చేయాల్సివుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీబీసీ విస్తరణ పనుల్లో భాగంగా కాంట్రాక్టు సంస్థ చిప్పిలి పనులు చేసింది. కూటమి ప్రభుత్వం పీబీసీ లైనింగ్ పనుల పేరుతో కృష్ణా జలాల తరలింపు నిలిపివేసి ఈ సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులు ఎండబెట్టింది.



కృష్ణా జలాలు తరలించక ఎండుతున్న చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు

గంగమ్మా..కరుణించమ్మా



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: కోరిన కోర్కెలు తీర్చే అనంతపురం గంగమ్మ ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గంగమ్మా కరుణించి.. కాపాడవమ్మా.. సకాలంలో వర్షాలు కురిపించు తల్లీ అంటూ భక్తులు వేడుకున్నారు.కొందరు బోనాలు సమర్పించారు. మరికొందరు తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

నీట్‌లో మెరిసిన పల్లవి



కడప ఎడ్యుకేషన్: నీట్–2025 ఫలితాల్లో కడపకు చెందిన మేరుగ పల్లవి జాతీయస్థాయిలో 743 కేటగిరి ర్యాంకు సాధించింది. పల్లవి 1 నుంచి 5 వరకు కడపలో ప్రైవేటు స్కూల్లో, 6 నుంచి 10వ తరగతి వరకు విద్యామందిర్‌లో చదివింది. ఇంటర్మీడియట్‌ను కడప నారాయణ జూనియర్ కళాశాలలో చదివింది. ఇంటర్‌లో 984 మార్కులు సాధించింది. ప్రతిభా పురస్కారాన్ని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతులు మీదుగా అందుకుంది. పల్లవి తల్లి లలిత(గృహిణి), తండ్రి రమేష్ కడప ప్రభుత్వ పురుషుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో న్యూరో సర్జన్‌గా చేరి పేద ప్రజలకు సేవ చేయాలనదే తమ జీవితాశయం అని పల్లవి అన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కూంబింగ్



గొల్లపల్లె బీటులో కూబింగ్ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది

సిద్దవటం: సిద్దవటం రేంజిలోని గొల్లపల్లె బీటులో కూబింగ్ నిర్వహించామని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు సిద్దవటం ఫారెస్టు రేంజి పరిధిలోని గొల్లపల్లె, ఫారెస్ట్ బీట్లలోని సమస్యాత్మక , అనుమానిత ప్రదేశాల్లో తమ సిబ్బంది ఆదివారం ఎర్రచందనం అక్రమాలు జరగకుండా కూంబింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అటవీ ప్రాంతాల్లోని సమీప గ్రామాల్లో ప్రజలకు ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనబడితే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేసు, ఫారెస్టుబీట్ అఫీసర్లు ఆది విశ్వనాథ్, మధు, పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగేతర శక్తి!



- ఈనెల 7న శనివారం అర్ధరాత్రి అనంతంపల్లె సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డిపై పుల్లంపేటలో హత్యాయత్నం చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు నిందితుల దాడి నుంచి ప్రాణాలు దక్కించుకున్నారు. వివాహానికి వెళ్లిన సుదర్శన్‌రెడ్డి ఇంటికి వస్తారని తెలుసుకొని పోలీసుస్టేషన్‌లో సమీపంలో మాటువేసి ఉన్న దుండగులకు అనూహ్యంగా చిక్కారు. పిడిబాకుతో పొడుస్తుండగా పెనుగులాటలో జారుడు గాయాలు తగిలాయి. సుదర్శన్‌రెడ్డి చావు కేకలు విన్పించడంతో ఇరుగుపొరుగు వారు నిద్రలేచి కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. ఈతతంగం మొత్తం పోలీసు స్టేషన్ ఎదుట చోటుచేసుకుంది.
- ఈనెల 13న శుక్రవారం సాయంత్రం ఓబులవారిపల్లె మండలం తల్లంవారిపల్లెలో భూవివాదంలో వాగ్వాదం చోటుచేసుకుంది. భూముల్లోకి వెళ్లే దారికి అడ్డంగా బీజేపీ నేత రాజగోపాల్‌రెడ్డి ముళ్ల కంచె వేశారు. ఆపై మద్యంమత్తులో రెచ్చిపోయి పరుషపదజాలంతో దూషణలకు దిగారు. దీంతో చలించిపోయిన గ్రామస్తులు ప్రతిఘటించారు. ఆత్మాభిమానంతో రాజగోపాల్‌రెడ్డిపై తిరగబడ్డారు. పరస్పర దాడుల్లో రాజగోపాల్ రెడ్డి గాయాలయ్యాయి.

- అమ్మ అండతో రెచ్చిపోతున్న కూటమి కార్యకర్తలు
- ఆ నియోజకవర్గంలో డమ్మీగా మారిన పోలీసు యంత్రాంగం
- ప్రతి విషయంలో జోక్యం... అమ్మ ఫోన్ వస్తే జడుసుకుంటున్న అధికారులు
- చెప్పింది చెప్పినట్లు ఆచరిస్తేనే విధి నిర్వహణలో కొనసాగింపు
- చట్టం, నిబంధనలంటే ఒప్పుకునేది లేదు ...బదిలీనే బహుమానం

సాక్షి టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలో వారంలోపు వేర్వేరుగా చోటుచేసుకున్న రెండు ఘటనల్లో పోలీసుల ట్రీట్‌మెంట్ ఆక్షేపణీయం. ఘర్షణ తలెత్తితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసు యంత్రాంగం పరస్పర వైరుధ్యాన్ని ప్రదర్శించింది. పుల్లంపేట పోలీసుస్టేషన్‌లోనే మాటువేసి అనంతంపల్లె మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు సుదర్శనరెడ్డిని అంతమొందించాలనే చర్యలకు పాల్పడిన టీడీపీ కార్యకర్తలపై 324 సెక్షన్లపెట్టి స్టేషన్ బెయిల్ ఇచ్చి గౌరవంగా ఇళ్లకు పంపించారు. భూముల్లోకి వెళ్లేందుకు అడ్డంగా ముళ్ల కంచె వేసి, దుర్భాషలాడుతూ వీరంగం చేసిన రాజగోపాల్‌రెడ్డిపై దాడి ఘటనలో నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లతో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అంతటితో సరిపెట్టక పోలీసుస్టేషన్లు మార్చుతూ చిట్వేల్‌కు తీసుకెళ్లి రాత్రంతా భారీగా కోటింగ్ ఇచ్చారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన భూమిక పోషించింది అక్కడి రాజ్యాంగేతర శక్తి. అమ్మగా పిలువబడే రాజ్యాంగేతర శక్తి స్వయంగా పోలీసు అధికారులకు ఫోన్ చేసి సుదర్శన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో అసలు ఎఫ్ఐఆర్ నమోదు చేయవద్దని పట్టుబట్టింది. కాదు కూడదు అని పోలీసులు బతిమాలి కొట్లాటగా చిత్రీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదే రాజగోపాల్‌రెడ్డిపై దాడి చేసిన కేసులో అప్పటికప్పుడు నిందితులను పట్టుకురావడం, ఆపై కోటింగ్ ఇవ్వడం, హత్యాయత్నం కేసు నమోదు చేయడం ఒకదాని వెంట ఒకటి క్రమంగా తెరపైకి వచ్చాయి.

మండలానికో ఇన్‌చార్జి...ఫైనల్ తీర్పు అమ్మదే...

ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వేకోడూరు నియోజకవర్గంలో సూపర్ బాస్ చెప్పిందే వేదంగా నడుస్తోంది. ఒకే కుటుంబ సభ్యులు మండలానికి ఒక ఇన్‌చార్జి ఉన్నప్పటికీ ఫైనల్ తీర్పు అమ్మ చెప్పినట్లు చేయాల్సిందే. అమ్మ చెప్పిందంటే అయ్యా చెప్పినా నిరుపయోగమే. అక్కడి ప్రజాప్రతినిధిని కాదని రాజ్యాంగేతర శక్తి మొత్తం వ్యవహారం నడిపిస్తోన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందుకు అనేక ఉదాహరణలు సైతం నియోజకవర్గ ప్రజలు కథలు కథలుగా చర్చించుకుంటున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు చట్టం.. నిబంధనలంటే అక్కడి విధుల నుంచి జారుకోవాల్సిందే. అలాంటి దుస్థితి రైల్వేకోడూరులో నియోజకవర్గంలో ఉండిపోయింది. ఆయా మండల ఇన్‌చార్జిలుగా ఉన్న కుటుంబ సభ్యులు అధికారులకు సిఫార్సు చేసినా అమ్మ నుంచి ఫోన్‌కాల్ వచ్చిందంటే అదే ఫైనల్. ఆ తీర్పునకు అనుగుణంగా అధికారుల చర్యలు ఉండిపోవాల్సిందే. చెప్పిన మాట చెప్పినట్లుగా ఆచరించకపోతే వెంటనే ఆ అధికారికి బదిలీ బహుమానంగా దక్కనుంది. అలాంటి పరిస్థితిని ఓ తహసీల్దార్ , మరో ఎస్ఐ ఎదుర్కొన్నారు. బదిలీపై విధుల్లో చేరిన తహసీల్దార్‌కు 9నెలల్లోనే మళ్లీ బదిలీ బహుమానంగా దక్కింది. ఓ ఎస్ఐకి కూడా అదే పరిస్థితి తలెత్తింది. దీంతో అధికారులు రాజ్యాంగేతర శక్తి నుంచి ఫోన్ కాల్ వస్తే గంగిరెద్దులా తలూపాల్సిందే, ఆచరణలో చూపెట్టాల్సిందేనని విశ్లేషకులు సైతం వాపోతున్నారు.

క్లుప్తంగా

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె సిటీ : కుటుంబ సమస్యలతో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లె పట్టణం శేష్‌మహల్ ఏరియాకు చెందిన సురేష్(39) భార్యతో గొడవపడి మనస్తాపానికి గురై పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన శివశంకర్ కుటుంబ సమస్యల కారణంగా పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వివాహిత అనుమానాస్పద మృతి


మృతి చెందిన మహాలక్ష్మి

పోరుమామిళ్ల : మండలంలోని దమ్మన్నపల్లె పంచాయతీ సుంకేసులపల్లెలో ఆదివారం ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. చెముడూరి నరేంద్ర మండలంలోని కాలువకట్టకు చెందిన మహాలక్ష్మి(25)ని ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఆయన తాపీమేస్త్రీగా పని చేస్తుంటాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో భర్తే చంపేసి, ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు చిత్రీకరించాడని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. నిత్యం తాగుతూ తన కూతురిని చిత్రహింసలకు గురి చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర పరారీలో ఉన్నాడు. ఎస్ఐ కొండారెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. విచారణ పూర్తయితే పూర్తి వివరాలు తెలుస్తాయి.

మైదుకూరులో లారీ చోరీ

మైదుకూరు : పార్కింగ్ చేసి ఉన్న తన లారీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన చాగంరెడ్డి సాంశివారెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని వనిపెంట రోడ్డులో ఉన్న జగన్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్ద తన సొంత లారీని పార్కింగ్ చేసి ఉంచినట్టు సాంబశివారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం చూడగా తన లారీ కనిపించలేదని, శనివారం రాత్రి చోరీకి గురై ఉంటుందని తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ రాజీనామా ఆమోదం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ రాజీనామాను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఎట్టకేలకు ఆమోదించారు. ఆయన మార్చి 27న తన రాజీనామా లేఖను పీసీసీ కార్యాలయానికి పంపారు. దీంతో అధికారంగా ఈ నెల 12న రాజీనామాను ఆమోదించినట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి ఆదివారం ప్రకటించారు.

కాంగ్రెస్ సమావేశానికి గైర్హాజరు

నగరంలోని ఐఎంఏ హాల్‌లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 12న నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి నగర అధ్యక్షుడు గైర్హాజరయ్యారు. అదే విధంగా డీసీసీ అధ్యక్షురాలు, నగర అధ్యక్షుడి మధ్య పార్టీ కార్యక్రమాల్లో సయోధ్య కుదరడం లేదు. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామాను ఆమోదించినట్లు సమాచారం.

దెబ్బతిన్న ప్రహరీ.. పడితే హరీ!

- దారుణంగా పెనుశిల ఘాట్ రోడ్డు
- 18 కిలోమీటర్లు.. 30 మలుపులు
- భయం.. భయంగా ప్రయాణం
- జిల్లాలో రాజధానికి వెళ్లే రెండవ మార్గం
- పట్టించుకోని కూటమి సర్కారు


కూలిపోయిన రక్షణ గోడ


ప్రొటెక్షన్ వాల్‌గా ఏర్పాటు చేసిన కట్టెలు


అధ్వానంగా రోడ్డు

రాజంపేట : పెనుశిల శ్రీ లక్ష్మీనరసింహ అభయారణ్యంలో 18 కిలోమీటర్ల మేర ఘాట్‌రోడ్డులో ఎండిన కట్టెలే రక్షణ గోడ(ప్రొటెక్షన్ వాల్)గా కనిపిస్తోంది. దీనిపై సంబంధిత శాఖ దృష్టి సారించలేదు. నిధులు లేవమో కట్టెలే ప్రొటెక్షన్ వాల్‌గా ఏర్పాటు చేసి పనులు నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఘాట్‌రోడ్డు అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ఆయన మరణాంతరం ఏర్పడిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. నెల్లూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు ఘాట్ రోడ్డు అభివృద్ధిపై దృష్టి సారించాలని వాహదారులు కోరుతున్నారు. అధికారంలో లేనప్పుడు ఊకదంపుడు ప్రసంగాలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు రోడ్ల దుస్థితిని పట్టించుకోవడం లేదు.

కట్టెలే.. రక్షణ గోడగా..

రోడ్డు వెంట అక్కడక్కడా రక్షణ గోడ కూలిపోయింది. దాన్ని పునఃనిర్మించలేదు. కొన్ని చోట్ల కట్టెలు ఏర్పాటు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో వదిలేశారు. కేవలం ప్యాచింగ్ పనులతో కాలయాపన.. మరమ్మతులతో కాలం నెట్టుకొస్తున్నారు. మొత్తం మీద ఈ రోడ్డులో 30 మలుపులు ఉన్నప్పటికీ, ఇందులో కొన్ని ప్రమాదకర సంఘటనలకు తావిచ్చిన పరిస్థితులు అనేకం ఉన్నాయి. కొన్ని చోట్ల రోడ్డు కుచించుకుపోయింది. మరికొన్ని ప్రాంతాల్లో అధ్వానంగా తయారైంది.

ఉభయ జిల్లాలకు..

ఉభయ జిల్లాలో రాజధానికి రా'పూర్' ఘాట్ రోడ్డును రెండవ రహదారిగా వినియోగించుకుంటున్నారు. అనంతపురం, కదిరి, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలకు చెందిన వారు ఈ రోడ్డు మార్గంలో.. నెల్లూరు, కావలి, ఒంగోలు, విజయవాడ, బెజవాడ, కాకినాడ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు.

ఎదురెదరుగా వాహనాలు వస్తే..

రాపూరు–చిట్వేలి మధ్య ఉన్న ఘాట్‌రోడ్డులో ఎదురెదరుగా వాహనాలు వస్తే అతిజాగ్రత్తగా ఉండకపోతే లోయలోకి పడాల్సి వస్తుంది. మలుపులు వద్ద పటిష్టమైన చర్యలు ఏమీకనిపించవు. చిన్నచిన్నపిట్టగోడలు తప్ప..వాటిని వాహనాలు అదుపుతప్పి ఢీకొన్న తట్టుకోలేని పరిస్థితులు ఉన్నాయి. మలుపుల వద్ద రెండు వాహనాలు ఎదురుపడితే దాటుకోవడానికి వాహనదారులు కష్టాపడాల్సి వస్తుంది. లోయలో పడిపోతామో అన్న భయాందోళనను ఈ రోడ్డు తలపిస్తోంది. సింగల్‌రోడ్డు కావడంతో రోడ్డుకు ఇరువైపు గుంతలు.. ఆనుకొని పిట్టగోడలు ఇక పరిస్థితి చెప్పనక్కర్లేదు.

రాష్ట్ర విభజనతో రద్దీగా..

ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత ఏపీ రాజధానికి వెళ్లేందుకు ఈ ఘాట్‌రోడ్డు అనుకూలమైనప్పటికి ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణం కొనసాగించాల్సిందే. అమరావతికి ఇప్పుడు ఈ రోడ్డు మార్గం మీదుగా వెళ్లే వారి సంఖ్య పెరిగింది. ఆర్టీసీ విజయవాడకు బస్సులను నడిపిస్తోంది. ఘాట్‌రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రైవేటు బస్సులు ఇంకా నడిపేందుకు యాజమాన్యాలు ముందుకు రావడం లేదు. ఉదయం నుంచి నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన వారు.. ఈ మార్గంలో ప్రయాణించడం ఇటీవల అధికమైందని చెప్పవచ్చు. గతంలో ఈ రోడ్డును స్టేట్ హైవేగా ప్రకటించి.. మళ్లీ ఆర్అండ్‌బీకి ఇచ్చేశారు. రాపూరు నుంచి వచ్చేటప్పుడు ఘాట్ రోడ్డు అధ్వానంగా తయారైంది.

గతంలో ప్రమాదాలిలా..

రాపూరు ఘాట్ రోడ్డులో గత ప్రమాదాలను ఒక సారి పరిశీలిస్తే.. ఈ రోడ్డు ఎంత అధ్వానంగా ఉందో తెలిసిపోతుంది. ఇప్పటి వరకు 32 మందికి పైగా ప్రమాదాల బారిన పడి మృత్యువాతకు గురయ్యారు.

- 1983లో పెళ్లి బృందం బస్సు బ్రేక్ ఫెయిల్ అయి లోయలోపడి ఇద్దరు మృతి చెందారు.
- 2007 మే 5న ఏకంగా ఐదుగురు మృతి చెందారు.
- 2007లో వరద తాకిడికి కదిరి బస్సు చిక్కి ఆరుగురు మృత్యువాత పడ్డారు.
- 2008 జూన్ 3న వాకాడు బస్సు లోయలో పడి ముగ్గురు మృతి చెందారు.
- 2008 సెప్టెంబరులో రైల్వేకోడూరు బస్సు లోయలోపడి 14 మంది మృతి చెందారు.
- 2008 అక్టోబరులో ఘాట్ మలుపులో లారీ, బస్సు, స్కూటర్ ఢీకొని భార్యభర్తలు మృతి చెందారు.

మోక్షం లభించేనా..!

రాష్ట్ర విభజనతో రాజధానికి రాజంపేట–నెల్లూరు రహదారి రోడ్డు ప్రధానమైనప్పటికీ.. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అభివృద్ధి చేయాలనే ఆలోచన చేయడం లేదు. రోడ్డు విస్తరణతోపాటు డబుల్ రోడ్డుగా చేసి ప్రమాద రహిత రహదారిగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికుల నుంచి డిమాండ్ వస్తోంది. ఇటు కడప, అటు నెల్లూరు జిల్లాలకు చెందిన పాలకులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన ఆవశ్యత ఎంతైనా ఉందని చెపుతున్నారు. రాజధానికి అన్ని మార్గాలను అభివృద్ధి చేస్తామని చెప్పుకొనే రోడ్ల మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి.. ముందు రాజధానికి ఉన్న రోడ్డును అభివృద్ధి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

డబుల్ రోడ్డుగా మార్చాలి



రాజంపేట నుంచి విజయవాడ, నెలూరు ప్రాంతాలకు వెళ్లే రహదారిలో రాపూరు ఘాట్ రోడ్డు అధ్వానంగా తయారైంది. నిత్యం వందలాదిగా భక్తులు పెంచలకోనకు వెళుతుంటారు. డబుల్ రోడ్డుగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ రోడ్డులో ప్రమాద నివారణ చర్యలు ఏపీ కనిపించడం లేదు. రక్షణ గోడల స్థానంలో కట్టెలు పెట్టడం ప్రభుత్వ దుస్థితికి అద్దం పడుతుంది.

–బి.శ్రీరాములు వడ్డెర, జిల్లా అధ్యక్షుడు, వడ్డెర సంఘం

పడితే లోయలోకి వెళ్లాల్సిందే



అమరావతి (విజయవాడ)కి వెళ్లే రహదారి ఘాట్ రోడ్డులో ప్రమాదకర ప్రయాణం చేయాల్సి వస్తోంది. రాపూరు నుంచి వచ్చేటప్పుడు ఘాట్ రోడ్డు అధ్వానంగా తయారైంది. సింగల్‌రోడ్డు కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది జరుగుతోంది. రోడ్డు కుచించుకుపోయింది. కొన్ని చోట్ల ప్రొటెక్షన్ వాల్స్ లేవు. పడితే నేరుగా లోయలోకి వెళ్లాల్సిందే. నెల్లూరు, అన్నమయ్య జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలి.

–మల్లికల్యాణ్, ఎన్ఆర్ఐ, రాజంపేట

హామీలపై ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్నాథరెడ్డి, మదనపల్లి ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్, నాయకులు

- వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి
- చంద్రబాబు ఏడాది పాలనపై పుస్తకావిష్కరణ

రాయచోటి : ముఖ్యమంత్రి చంద్రబాబు దుష్టపాలనకు ముకుతాడు వేయాలని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని సీఎం చంద్రబాబును, కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని పేర్కొన్నారు. ఆదివారం రాయచోటిలోని అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా సీఎం చంద్రబాబు ఏడాది పాలనపై పుస్తకాన్ని విడుదల చేశారు. జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పేరుతో వైఎస్ఆర్‌సీపీ పుస్తకాన్ని మదనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్ అహ్మద్, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాలతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ఏడాది పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఏడాది కూటమి పాలనంతా విధ్వంసమేనని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్నే అమలు చేశారని, దీనికి సంబంధించిన వాస్తవాలు, ఆధారాలతో సహా ఈ పుస్తకాన్ని తెచ్చినట్లు తెలిపారు. మోసపు హామీలు, అబద్ధపు మాటలతో మభ్యపెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎలా వెన్నుపోటు పొడిచారో కూడా ఈ పుస్తకంలో వివరించినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన బంగారు భవిష్యత్తు వంటిదని, కూటమి, సీఎం చంద్రబాబు ఏడాది పాలనంతా చీకటి మయమే అని ఎద్దేవా చేశారు.

అట్టర్ ఫ్లాప్

మదనపల్లి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ నిసార్ అహ్మద్ మాట్లాడుతూ ఏడాది పాలన అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే చంద్రబాబు అడ్రస్ గల్లంతవుతుందన్నారు. ఏడాది పాలనలో మొట్టమొదటిగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి ప్రతి ఒక్కరినీ చిత్రహింసలకు గురి చేశారన్నారు. వక్ఫ్ బిల్లు విషయంలో చంద్రబాబుపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేసి మైనార్టీలను వెన్నుపోటు పొడిచారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి దిశ అనే ఒకే ఒక యాప్‌తో మహిళలకు రక్షణ కల్పించారన్నారు. గంజాయి, మద్యం విచ్చలవిడి సరఫరాతో రాష్ట్రాన్ని మత్తులో ముంచేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ పోరాటం వల్లే తల్లికి వందనం అమలు చేశారని, అది కూడా అరకొర మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడి క్వారీపై గూండాల దాడి

- టిప్పర్ అద్దాలు, యంత్రాలు ధ్వంసం
- సిబ్బందిపై రాళ్ల దాడి



పలిగిన టిప్పర్ అద్దాలు, ఎస్ఐ గాయత్రికి ఫిర్యాదు చేస్తున్న బాధితుడు

మదనపల్లె రూరల్ : బీజేపీ నాయకుడు జబ్బల శ్రీనివాసులు క్వారీపై శనివారం రాత్రి గూండాలు దాడి చేసి, టిప్పర్ అద్దాలు, యంత్రాలను ధ్వంసం చేయడంతోపాటుగా సిబ్బందిని గాయపరిచినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా బాధితుడు జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండలంలోని బసినికొండ గ్రామ పంచాయతీ సర్వే నంబర్:1072లో 3.50 హెక్టార్లలో తన పేరు మీద, భార్య జబ్బల మీనా పేరు మీద ప్రభుత్వ అనుమతితో 2004లో క్వారీ లీజుకు ఇస్తూ ఎన్‌టీసీ మంజూరు చేశారన్నారు. 2007లో గాయత్రి స్టోన్ క్రషర్ పేరు మీద 1 హెక్టార్, 2009లో సర్వే నంబర్ 1072లో 1.780 హెక్టార్ల ప్రభుత్వ భూమిని క్వారీ పనులకు భూగర్భ గనుల శాఖ అనుమతులను ఇచ్చిందన్నారు. అయితే కొంత కాలంగా క్వారీ స్థలానికి సంబంధించి తమకు డీకేటీ పట్టా భూమి ఉందని కొందరు పనులకు అంతరాయం కలిగించారన్నారు. దీంతో తాను మదనపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించడంతో ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వడం జరిగిందన్నారు. జూన్ 3న మదనపల్లె భూగర్భ గనులశాఖ అధికారి, జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా క్వారీలో సర్వే నిర్వహించారన్నారు. పట్టా ఉందని చెప్పుకొంటున్న మునిస్వామి ఆచారి భార్య, కుటుంబ సభ్యులను ఇన్‌స్పెక్షన్‌కు హాజరు కావాలని కోరడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు సర్వేలో పాల్గొని, మునిస్వామి ఆచారి కుటుంబ సభ్యులకు భూమి ఉందా లేదా అనే విషయమై రికార్డులు పరిశీలించి, గనుల శాఖ అధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారన్నారు. అయితే...14వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఓ రాజకీయ నాయకుడి ముఖ్య అనుచరుడి ఆదేశాలతో సుమారు 30 మందికి పైగా కర్రలు, రాళ్లతో వచ్చి క్వారీలోని యంత్రాలు, టిప్పర్ లారీ అద్దాలను ధ్వంసం చేయడంతోపాటు అక్కడ ఉన్న సిబ్బందిని గాయపరిచారన్నారు. భూమి తమదేనని, ఎలాంటి క్వారీ పనులు చేయవద్దని దుర్భాషలాడుతూ గొడవకు దిగారన్నా రు. రాష్ట్ర భూగర్భ, గనులశాఖ కేటాయించిన క్వారీ స్థలంలో అన్ని ప్రభుత్వ అనుమతులతో తాను క్వారీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2004 నుంచి కొంత కాలం వరకు మునిస్వామి ఆచారి కుటుంబ సభ్య లు, లేదా ఇతరులు ఎవరూ తమ క్వారీ వద్దకు రాలేదన్నారు. స్థలం తమదంటూ రెవెన్యూ అధికారులను సంప్రదించలేదన్నారు. ఉద్దేశ పూర్వకంగానే కొందరు వ్యక్తులు తనను ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో, భూమిపై హక్కులు ఉన్నాయని తెలుపుతూ, గొడవలు, ఘర్షణలకు దిగుతున్నారన్నారు. అనుమతి లేకుండా క్వారీ స్థలంలో ప్రవేశించి టిప్పర్ అద్దాలు, యంత్రాలను ధ్వంసం చేసిన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాల్సిందిగా డీఎస్పీ మహేంద్ర, తాలూకా సీఐ కళావెంకటరమణ, ఎస్ఐ గాయత్రికి ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు


బ్రహ్మంగారిమఠం : గాయపడిన లక్షుమయ్య

బ్రహ్మంగారిమఠం : ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయాల పాలయ్యారు. బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని బి.మఠం – మిట్టమానుపల్లె రోడ్డులో ఈశ్వరీదేవి గృహ సమీపాన స్కూటర్ ప్రమాదంలో బి.మఠంకు చెందిన లక్షుమయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. మైదుకూరు మండలం అక్కులాయపల్లెకు చెందిన లక్షుమయ్య గతంలో ఈశ్వరీదేవి మఠంలో కొంత కాలం అటెండర్‌గా పని చేశాడు. మఠంలో నివాసం ఉంటున్నాడు. ఆయన అక్కులాయపల్లెకు వెళ్లి టీవీఎస్ మోపెడ్ మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. స్కూటర్‌ను ఏదైనా వాహనం ఢీకొట్టిందా లేక కింద పడి ప్రమాదానికి గురయ్యాడా తెలియాల్సి ఉంది. బాధితుడిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని..


లక్కిరెడ్డిపల్లి : ప్రమాదానికి గురైన జై భరత్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కుర్నూతల గ్రామం అగ్రహారం వద్ద ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుర్నూతుల గ్రామం డియ్యాలవాండ్లపల్లికి చెందిన జై భరత్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. అగ్రహారం వద్ద ఎదురుగా వస్తున్న కొయ్యల ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో జై భరత్ రెడ్డితోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న నాగయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. బాధితులను వెంటనే లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం రాయచోటిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వారిని తిరుపతికి తరలించినట్లు బంధువులు తెలిపారు. లక్కిరెడ్డిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేదన.. అరణ్య రోదన

- అష్టకష్టాల్లో దివ్యాంగ తెలుగు తమ్ముడు
- పింఛన్ పునరుద్ధరించాలని విన్నపం
- చిరుద్యోగుల గోడు పట్టించుకోవాలని విజ్ఞప్తి


కుమ్మర శివరాం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు పంచాయతీ గొల్లపల్లికి చెందిన కుమ్మర శివరాం టీడీపీ వీరాభిమాని. తమ పార్టీ అధికారంలోకి వస్తే.. తమ జీవితం బాగుపడుతుందని ఆశించాడు. అయితే ఆయన ఆశలు అడియాసలు అయ్యాయి. ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఆవేదన అరణ్య రోదనగా మారింది. ఆయనకు వికలాంగుల కోటాలో చౌక దుకాణం ఉండేది. ఈ తరుణంలో టీడీపీ అభ్యర్థిగా ఇతను సర్పంచ్‌గా పోటీ చేసే నేపథ్యంలో.. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం తనకు జీవనాధారంగా ఉన్న చౌక దుకాణంను పోగొట్టుకున్నాడు. 2006లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఇతను ఘన విజయం సాధించి ఐదేళ్లు పదవిలో కొనసాగాడు. పదవీ కాలం పూర్తయ్యాక నెలవారి వికలాంగ పెన్షన్ సొమ్ము తప్ప.. వేరే జీవనాధారం లేకుండా పోయింది. మళ్లీ కుటుంబాన్ని పోషించేందుకు ఔట్ సోర్సింగ్ ద్వారా మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో వాచ్‌మ్యాన్‌గా చేరాడు. వాచ్‌మ్యాన్ జీతంతోపాటు వికలాంగ పెన్షన్ సొమ్ముతో కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఇదిలా ఉండగా తన కుమారుడు మహేష్‌కు వివాహం చేసి కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసినా ఇంత వరకు అతీగతీ లేదు. అంతేగాక తనకు వచ్చే వికలాంగ పెన్షన్ సైతం మూడేళ్ల నుంచి రాలేదన్నాడు. కుటుంబంలో తాను ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తుడినని, అందుకే సంక్షేమ పథకాలు రాలేదని అధికారులు చెప్పారని శివరాం ఆవేదన వ్యక్తం చేశాడు.

సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

శివరాం మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగానే ఔట్ సోర్సింగ్‌లో వివిధ శాఖల్లో పని చేస్తున్న చిరుద్యోగులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని చంద్రబాబు హామీ ఇస్తే ఎంతో సంబర పడ్డామన్నాడు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా తమ జీవితాలు కలగా మిగిలిపోయాయన్నాడు. చాలీ చాలని నెలసరి వేతనాలతో తమ బతుకులు దుర్భరంగా ఉండటంతో కనీసం తనకు రద్దు చేసిన వికలాంగ పెన్షన్‌ను తిరిగి పునరుద్ధరించాలని మంగళగిరికి వెళ్లి మంత్రులకు వినతులు అందించానన్నాడు. అన్నమయ్య జిల్లా కేంద్రంలో కూడా జిల్లా కలెక్టర్‌కు అర్జీ ద్వారా తన గోడు వెళ్లబోసుకున్నా ఇంత వరకు ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని అసహనం వ్యక్తం చేశాడు. వితంతు పెన్షన్, తల్లికి వందనం, రేషన్‌కార్డులు లాంటి పథకాలు రాక తన లాంటి ఎంతో మంది చిరుద్యోగుల దుస్థితి కూడా ఇలాగే ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని శివరాం విన్నవిస్తున్నాడు.

అరుదైన యోగ రామాలయం

- పెద్దపుత్తలో విశిష్ట మూలమూర్తులు
- యోగా ముద్రలో సీతారాములు
- చోళుల నిర్మాణంగా పరిశోధన


పెద్దపుత్తలోని యోగ రామాలయం


ఆలయంలోని మూలమూర్తులు

కడప కల్చరల్ : కడప జిల్లాలో విశిష్టమైన రామాలయం ఉంది. వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామంలో యోగ రామాలయంగా ప్రసిద్ధి చెందింది. అత్యంత పురాతనమైనదిగా భావిస్తున్న ఈ ఆలయానికి దాదాపు 600 ఏళ్ల చరిత్ర ఉన్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు జిల్లాను పాలించిన చోళులు ఈ ఆలయాన్ని నిర్మించారని తెలుస్తోంది. ఇందులో మిగతా ఆలయాల్లో లాగా సీతారాములు నిలుచొని ఆశీర్వదించే భంగిమలో కనిపించడం లేదు. కేవలం యోగ ముద్రలో మూర్తులు కనిపిస్తున్నారు. ప్రతి రామాలయంలో సీతారాములు నిలుచొని ఆశీర్వదిస్తున్న భంగిమలో మూలమూర్తులు ఉంటాయి. కానీ మన జిల్లాలోని ఈ రామాలయంలో రాముడు, సీతమ్మ యోగ ముద్రలో కూర్చొని ఉన్న మూలమూర్తులను చూడవచ్చు. ఇలాంటి విశిష్టత గల ఆలయం ఇదొక్కటే అని పరిశోధకులు చెబుతున్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగ దినోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో యోగ ముద్రలో ఉన్న శ్రీరామచంద్ర స్వామి గురించి ప్రత్యేక కథనం.

పరిశోధకుల పరిశోధన

పెద్దపుత్తలోని రామాలయంలో శ్రీరాముని ధనుర్బాణాలు లేవు. రాముడు పద్మాసనంలో యోగ ముద్రలో కనిపిస్తుండటం విశేషం. రాముడి కుడి చేతి బొటన వేలు, చూపుడు వేలు కలిపి ఉంచిన చిన్ముద్రలో కనిపిస్తారు. భూమి స్పర్శ ముద్రతో భూమిని నేలను తగులుతున్నట్లుగా ఉంది. రాముడే కాక సీతమ్మ కూడా రాముడికి ఎడమ వైపున కూర్చొన్న భంగిమలో మనం చూడవచ్చు. చేతిలోని పద్మాన్ని ధరించి ఉండటం కనిపిస్తుంది. లక్ష్మణుడు మాత్రం ధనుర్బాణాలతో శ్రీరామునికి కుడి వైపు నిలుచొని ఉన్నారు. ఈ ఆలయంలో ఆంజనేయులు కూడా తన ప్రత్యేకత చాటుకున్నారు. ఆయన శ్రీరాముని విగ్రహానికి ఎదురుగా యోగ ముద్రలో చేతిలో తాళ పత్రాలతో కనిపిస్తారు. ఇలాంటి విగ్రహాలు తమిళనాడులోని జలదుర్గ ప్రాంతంలో ఉన్నట్లు పరిశోధకుల సమాచారం. అనంతపురంలోని శింగనమల రామాలయంలో కూడా దాదాపు ఇవే పోలికలు గల విగ్రహాలు ఉన్నట్లు యోగి వేమన విశ్వ విద్యాలయ పరిశోధకులు తెలుపుతున్నారు. ఆ బృందం సభ్యులందరూ ఈ ఆలయంతోపాటు పెద్దపుత్తలోని యోగ రామాలయాన్ని పరిశీలించారు. మూల విరాట్లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత తమిళనాడులోని అనంతపురంలో కూడా ఇలాంటి విగ్రహాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై పరిశోధనలు కొనసాగితే మరిన్ని వివరాలు తెలుస్తాయని పరిశోధకులు పేర్కొంటున్నారు. ఇలాంటి పురాతన ఆలయాలు, విశిష్టత గల దేవతామూర్తుల విగ్రహాలు, శాసనాలు తదితర వారసత్వ సంపద కూడా వెలుగు చూసే అవకాశం ఉందని తెలుస్తోంది.


హనుమంతుడి విగ్రహం

పురాణాల్లో..

రాముడు సీతమ్మ యోగ ముద్రలో ఉన్నట్లు కనిపించే దృశ్యాలను అధ్యాత్మ రామాయణంలో చూడవచ్చు. శ్రీరాముడు హనుమంతునికి తారక మంత్ర బ్రహ్మోపదేశం చేశారు. ఈ ఘట్టం ఆధారంగా పెద్దపుత్త యోగ రామాయణంలో మూల మూర్తులను రూపొందించి ఉండవచ్చని పరిశోధకులు తెలుపుతున్నారు. విశిష్టత గల ఈ రామాలయంలోని మూల మూర్తులను కాపాడుకోవాల్సిన అవసరం జిల్లా వాసులపై ఉంది.